క్లుప్తంగా

ఆర్టీసీ బస్టాండు స్థలం లీజుకు ఇవ్వబడును

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండులోని ఖాళీ స్థలం 0.46 సెంట్లు 15 సంవత్సరాలపాటు లీజుకు ఇచ్చేందుకు నిర్ణయించినట్లు బద్వేలు డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వాపారులకు ఈ స్థలం అద్దెకు ఇస్తామన్నారు. ఈనెల 8న సాయిరాం జూనియర్ కాలేజీలో ఉదయం 10 గంటలకు ఔత్సాహిక వ్యాపారుల సమావేశం ఏర్పాటు చేశామని, ఆసక్తి కలవారు పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో కడప, మైదుకూరు ఆర్టీసీ అధికారులు పాల్గొంటారన్నారు.

వీధి కుక్కల నుంచి రక్షణ కల్పించండి

పోరుమామిళ్ల : స్థానిక ప్రజలను వీధి కుక్కల నుంచి కాపాడాలని ఇన్సాఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సఫా, చాంద్‌బాషాలు అధికారులను కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ పట్టణంలో వీధి కుక్కలతో అందరూ బెంబేలెత్తిపోతున్నారన్నారు. బెస్తవీధి, కూరగాయల మార్కెట్, గిరినగర్, మహబూబ్‌నగర్, తదితర ప్రాంతాల్లో కుక్కలు కరవడం ఎక్కువైందన్నారు. పంచాయతీ అధికారులు త్వరగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

జూదరుల అరెస్ట్

రాజుపాళెం : వెల్లాల గ్రామంలో బైపాస్ రహదారిలో ఉన్న ఓ కల్యాణ మండపం వెనుక జూదమాడుతున్న నలుగురిని పట్టుకున్నట్లు ఎస్‌ఐ రాజగోపాల్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2,500 నగదును సీజ్ చేయడంతో పాటు వారిపై కేసు నమోదు చేశామని వివరించారు.

11న మండల సర్వసభ్య సాధారణ సమావేశం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయ సభాభవనంలో ఈనెల 11న ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉపేంద్రా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో వివిధ అభివృద్ధి అంశాలపై, సమస్యలపై చర్చిస్తారని ఆయన పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో సమావేశంలో పాల్గొనాలని పేర్కొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

అన్నదానం

ప్రొద్దుటూరు : స్థానిక ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులోని 'అమ్మా నాన్న మదర్ థెరిస్సా షల్టర్' వృద్ధాశ్రమం ప్రెసిడెంట్ వై.హిదాయత్ ఆధ్వర్యంలో పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల పౌర్ణమి సందర్భంగా అనాథలకు, అభాగ్యులకు, పేదలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పల్లవోలులో వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని పల్లవోలు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం శనివారం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్య శిబిరం నిర్వహించి ప్రజలందరికీ అన్ని రకాలైన వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పల్లవోలు గ్రామస్తులు వినియోగించుకోవాలని వైద్యాధికారి కోరారు.

8 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోని పుట్టపర్తి నారాయణాచార్యుల ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఈనెల 8 నుంచి జూన్ 11 వరకు వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి టి.తిరుపతమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు వేసవి సెలవుల్లో వివిధ అంశాలపై శిక్షణ ఇస్తామని ఆమె పేర్కొన్నారు. కథలు వినడం, కథలు చెప్పడం, పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారని వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మొలకల పౌర్ణమి వేడుకలు

పోరుమామిళ్ల : మండలంలోని రామాయపల్లెలో శుక్రవారం మొలకల పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామదేవతకు మొలకెత్తిన నారు బుట్టలు సమర్పించి రైతుల ఆశలు నెరవేరాలని కోరుకున్నారు.

రేపు ఆలయ వార్షికోత్సవం

గోపవరం : మండలంలోని రాచాయపేటలో వెలసి ఉన్న శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ 15వ వార్షికోత్సవం ఈనెల 7వ తేదీ ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని వార్షికోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కంటి పరీక్షలు

చాపాడు : గ్రామీణ ప్రాంత పేద ప్రజల కోసం ప్రభుత్వం డా.వైఎస్సార్ కంటి వెలుగు పథకం ప్రవేశపెట్టిందని కంటి వైద్యులు డాక్టర్ ఎంఎస్ తేజ పేర్కొన్నారు. మండల కేంద్రమైన గ్రామ సచివాలయం వద్ద మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో శుక్రవారం డా.వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 73 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో పలువురికి కంటి ఆపరేషన్లు అవసరమని వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం స్రవంతి, ఆశా కార్యకర్తలు పెర్సీ, కుళ్లాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



ఇటుగుల్లపాడులో లబ్ధిదారురాలికి బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

కాశినాయన : ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పగడాలపల్లె, పాలగిరి, ఇటుగుల్లపాడు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తూ అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని అన్నారు. ఇటుగుల్లపాడు, సావిశెట్టిపల్లె, కొండ్రాజుపల్లె, వరికుంట్ల, బాలాయపల్లె, గంగనపల్లె చెరువులకు లిఫ్ట్‌ఇరిగేషన్ ద్వారా నీరు అందించే పనులను త్వరలో మొదలు పెడతారని అన్నారు. కొంత మంది డీకేటీ పట్టాలను ఆన్‌లైన్ చేయాలని ఎమ్మెల్యేకు తెలిపారు. త్వరలో అసైన్‌మెంట్ కమిటీ జరుగుతుందని, అందులో పేర్లు నమోదు చేసుకుంటే ఆన్‌లైన్ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసానిఆదిత్యరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, స్థానిక సర్పంచ్ నాగలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నశేషయ్య, ఆదినారాయణరెడ్డి, బాలయ్య, కొండయ్య, ప్రభాకర్‌రెడ్డి, రమణయ్య, నాగసుబ్బారెడ్డి, చిన్నరమణయ్య, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

బద్వేలు అర్బన్ : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఏ గడపకు వెళ్లినా ... ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో తమ జీవితాల్లో వెలుగులు నిండాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డులో గల చింతపుత్తాయపల్లె గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి గడపను సందర్శించారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి ప్రభుత్వం ద్వారా వారు పొందిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, మండల కన్వీనర్ రామసుబ్బారెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు నారాయణరెడ్డి, రోశిరెడ్డి, సుబ్బారెడ్డి, రవిచంద్రారెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, జయరామిరెడ్డి, కేశవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, వివిధశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డాక్టర్ హనీఫ్‌బాబా

ప్రొద్దుటూరు క్రైం : పోషకాహారం తీసుకోవడం వల్ల గర్భిణులు, బాలింతల్లో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని కామనూరు పీహెచ్‌సీ హనీఫ్‌బాబా, రూరల్ సీడీపీఓ అరుణకుమారి తెలిపారు. ఈశ్వరరెడ్డి నగర్‌లోని సుబ్బారావు కొట్టాలలో శుక్రవారం ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆరోగ్యం, దోమల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. దోమ పుట్టకూడదు–దోమ కుట్టకూడదు అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరీ, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల సీహెచ్‌ఓలు శిరీష, గంగతులసి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో ఎరువులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.నాగరాజు

అట్లూరు : రైతు భరోసా కేంద్రాల్లో అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని బద్వేలు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ.నాగరాజు తెలిపారు. అట్లూరు ఆర్బీకేలో శుక్రవారం నిర్వహించిన గ్రామస్థాయి వ్యవసాయ మండలి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతుల శ్రేయస్సే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ప్రస్తుతం అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచడంతో పాటు జీలగలు, జనుములు, పిల్లిపెసర వంటి పచ్చిరొట్టె ఎరువుల విత్తనాలు సబ్సిడీకి రైతులకు అందజేయనున్నామన్నారు. అలాగే రైతులు జింక్, జిప్సం 50 శాతం సబ్సిడీతో అందజేయాలని కోరారు. కార్యక్రమంలో రైతుభరోసా కేంద్ర వ్యవసాయ సహాయకులు అరుణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రభుత్వాస్పత్రి రోడ్డు ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో దాదాపు రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం సాయంత్రం స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రి వద్ద పూర్తయిన రోడ్డు డివైడర్, సెంట్రల్ లైటింగ్ ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. ఈ పనులతోపాటు కొత్తగా నిర్మించిన మున్సిపల్ ఎదురుగా ఉన్న గాంధీ పార్కు, టూటౌన్ పోలీస్‌స్టేషన్ రోడ్డులో నిర్మించిన మూడో కాలనీ పార్కుకు, శ్రీరాములపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలను మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి శనివారం ప్రారంభిస్తారని తెలిపారు. రూ.120 కోట్లతో జరుగుతున్న అమృత్ తాగునీటి పథకం పనులను, రూ.50.90 కోట్లతో మున్సిపల్ కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి, రాయలసీమ పోలీసు కంప్లెంట్ అథారిటీ మెంబర్ కాకర్ల నాగేశారెడ్డి, మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్శల భాస్కర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

గరుడ వాహనంపై చెన్నకేశవుడు



రాజుపాళెం : మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై అత్యంత వైభవంగా ఊరేగించారు. ఈ ఊరేగింపు సందర్భంగా ఉత్సవ విగ్రహాలను శోభాయమానంగా అలంకరించారు. స్వామి వారి ఊరేగింపు గ్రామ పురవీధులలో వైభవోపేతంగా జరిగింది. ఆలయ చైర్మన్ కానాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి, ఈఓ బీవీ నరసయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. సర్పంచ్ రాధ, దామోదర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, అర్చకులు పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు తప్పవు



అక్రమ లేఅవుట్లు పరిశీలిస్తున్న అధికారులు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల, రంగసముద్రం పంచాయతీల్లో ఎవరైనా అనుమతి లేకుండా లేఅవుట్లు, నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు పెడతామని అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ నందన్, ఏపీఓ కృష్ణసింగ్ హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం రెండు పంచాయతీల్లో అక్రమ అలేఅవుట్లు, నిర్మాణాలు జరిగిన ప్రాంతాలను వారు పరిశీలించారు. అనంతరం వైస్ చెర్మన్ నందన్ విలేకరులతో మాట్లాడుతూ 300 చదరపు అడుగులు మించితే అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. 30 మంది అక్రమ లేఅవుట్లు వేసినట్లు గుర్తించి నోటీలు పంపించగా ఇద్దరు పెనాల్టీ కట్టి అనుమతి పొందారన్నారు. పెనాల్టీ చెల్లించని వారిపై కేసు పెడతామన్నారు. బద్వేలు రోడ్డులో కమ్మవారిపల్లె సమీపంలో చాలా భవనాల నిర్మాణాలు జరిగాయని, అక్రమ లేఅవుట్లు ఉన్నాయన్నారు. అందరూ క్రమబద్ధీకరించుకోవాలన్నారు. పట్టణ శివారు మల్లకతువ దగ్గరున్న సిరి ఫంక్షన్‌హాలుకు అనుమతి లేనందున నోటీసు జారీ చేశారు. కార్యక్రమంలో ప్లానింగ్ సెక్రటరీ శ్వేత పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామి తిరునాల



ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయ స్వామి

ఖాజీపేట : శ్రీ వీరాంజనేయ స్వామి తిరుణాల మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండలాగుడు పోటీలను ఎపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం రెండు ఎద్దుల పోటీలు, ట్రాక్టర్ ట్యాలీ తో రివర్స్ పోటీలు నిర్వహించారు. పిల్లల కోసం ప్రత్యేక పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి ఆలయ కమిటీ సభ్యులు బహుమతి ప్రదానం చేశారు.

వైభవంగా తిరుమలకొండస్వామి తిరునాల

కలసపాడు : మండలంలోని మామిళ్ళపల్లె సమీపంలో వెలసిన శ్రీతిరుమలకొండస్వామి తిరునాల శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుణాల సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బేస్తవారిపేట మండలం జేసీఅగ్రహారం గ్రామానికి చెందిన సాయిసీతక్‌కి చెందిన వృషభాలు మొదటి బహుమతి రూ.50 వేలు, పిడుగురాళ్ళ గ్రామానికి చెందిన అంజిరెడ్డికి చెందిన వృషభాలు రెండవ బహుమతి రూ.30 వేలు, బాపట్ల జిల్లా బల్లిరవ్వ గ్రామానికి చెందిన వీరస్వామిచౌదరికి చెందిన వృషభాలు మూడవ బహుమతి రూ.20 వేలును గెలుచుకున్నాయి. సింగిల్‌విండో అధ్యక్షులు పురుషోత్తంరెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా తిరునాల

బి.కోడూరు : మండలంలోని ఎర్రిఓబన్నబావి సమీపాన గల తూర్పుకొండ సమీపాన వెలసి ఉన్న శ్రీనల్లగొండలక్ష్మీనరసింహస్వామి తిరునాలను శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని తిరునాలను వీక్షించారు.

హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ ప్రారంభం



శ్రీ న్యూ వివేకానంద హోల్ సేల్ క్లాత్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణంలోని కొర్రపాడు రోడ్డులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా నూతనంగా నిర్మించిన శ్రీ న్యూ వివేకానంద హోల్ సేల్ క్లాత్ మార్కెట్‌ను శుక్రవారం ప్రారంభించారు. క్లాత్ మార్కెట్ అసోసియేషన్ ప్రతినిధులు ఉదయం పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించారు. పెద్ద సంఖ్యలో ప్రముఖులు, వ్యాపారులు పాల్గొని అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గోపిరెడ్డి గురివిరెడ్డి మాట్లాడుతూ పెరిగిన అవసరాలకు అనుగుణంగా కొత్తగా శ్రీ న్యూ వివేకానంద హోల్ సేల్ క్లాత్ మార్కెట్‌ను నిర్మించామని తెలిపారు.

సమసమాజ దార్శనికుడు కారల్‌మార్క్స్

బద్వేలు అర్బన్ : దోపిడీ రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేసిన సమసమాజ దార్శనికుడు కారల్‌మార్క్స్ అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు, డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ఎం.చిన్నిలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సుందరయ్యభవనంలో సీపీఎం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కారల్‌మార్క్స్ 205వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ పట్టణ నాయకులు ప్రవీణ్‌కుమార్, నాగార్జున, మహిళా కన్వీనర్ గురుదేవి, కో కన్వీనర్ నాగేశ్వరి, సీఐటీయూ పట్టణ నాయకులు రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏరియా సహాయ కార్యదర్శి చంద్రమోహన్‌రాజు, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి నరసింహ పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



కనకదుర్గమ్మ అమ్మవారు

బద్వేలు అర్బన్ : స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్ ఆవరణలోని సబ్‌జైలు సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం వైశాఖమాసం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కనకదుర్గమ్మ అమ్మవారికి ద్రాక్ష పండ్లతో నిర్వహించిన ప్రత్యేక అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. సబ్‌జైలు సూపరింటెండెంట్ శ్రీహరి, ఆలయ ప్రధాన అర్చకులు ప్రదీప్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా రథోత్సవం



రథోత్సవంలో గంగా రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కన్నుల పండువగా రథోత్సవం నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి అలంకరించారు. అనంతరం గంగా రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి రథంపై ఆశీనులను చేశారు. అనంతరం పురవీధుల్లో శివనామస్మరణల మధ్య రథోత్సవం వైభవంగా జరిపారు. ఆలయ ఈఓ శంకర్ బాలాజీ, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మినరసింహస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి కల్యాణం శుక్రవారం ఘనంగా జరిగింది. స్వామివారి నూతన విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించిన అనంతరం కల్యాణం నిర్వహించారు. భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

కమనీయంగా కల్యాణోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానికపాతమార్కెట్‌లోని శ్రీమహాలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో శుక్రవారం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా శ్రీచెన్నకేశవస్వామి, మహాలక్ష్మిదేవికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికపై ఆశీనులను చేసి వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

బి.కోడూరు : మండలంలోని సగిలేరు ఒడ్డున వెలసిన చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ ధర్మకర్త ఓ.జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

దువ్వూరు : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర నోడల్ అధికారి జి.రమాదేవి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని దువ్వూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఓపీ రిజిస్టర్, కాన్పుల రిజిస్టర్, రోగులకు అందించే మందుల రిజిస్టర్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగుల పేర్లను, వారికి చేసిన సేవలు, ఇచ్చిన మందులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆస్పత్రి సిబ్బందికి సూచించారు. అనంతరం ఆమె నీలాపురంలోని హెల్త్ సెంటర్‌ను, 104 వాహనంలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు సురేష్‌బాబు, సమీర పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ

ముద్దనూరు : జిల్లాస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఈనెల 12వ తేదీ నుంచి ముద్దనూరులో నిర్వహించనున్నట్లు టోర్నీ నిర్వాహకులు తెలిపారు. స్థానిక శివాలయం పక్కన మైదానంలో నిర్వహించే జిల్లాస్థాయి టోర్నీలో విన్నర్ జట్టుకు మొదటి బహుమతిగా రూ.50వేలు, రన్నర్ జట్టుకు ద్వితీయ బహుమతిగా రూ.30వేలు నగదు అందజేస్తారన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనే ఒక్కోజట్టు ఎంట్రీ ఫీజు రూ.1500లు చెల్లించాలని, ఇతర వివరాలకు 9948051605, 9347113240 అనే నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

జమ్మలమడుగు : మైలవరం మండలం నవాబుపేట గ్రామంలో కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మూలె సుధీర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్టీపీపీలో కళాజాత ప్రదర్శన

ఎర్రగుంట్ల : ఎవరైన చట్ట వ్యతిరేఖ కార్యకలాపాలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలమల్ల ఎస్‌ఐ సంజీవరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆర్టీపీపీలో పోలీసుల ఆధ్వర్యంలో పరివర్తన కళాజాత అవగాహన సదస్సు నిర్వహించారు.

ఘనంగా లక్ష్మీ నరసింహస్వామి జయంతి



అలంకరణలో లక్ష్మీ నరసింహస్వామి మూలవిరాట్

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధి నరసింహాపురం గ్రామంలోని పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి జయంతి, కళ్యాణ మహోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామి, అమ్మవారి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేంగా పట్టు వస్త్రాలతో, వెండికవచాలు, రంగురంగుల పూలతో అలంకరించారు. గణపతి, నవగ్రహ, లక్ష్మీనరసింహ, సుదర్శన హోమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం లక్ష్మీనరసింహాస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికపై ఆశీనులను చేసి సుమూహూర్తంలో కల్యాణోత్సవాన్ని కమనీయంగా జరిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.